క్లుప్తంగా

పాఠశాలకు ప్రింటర్ అందజేత



ప్రింటర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప

ఆదోని అర్బన్ : స్థానిక మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప తన తండ్రి లక్ష్మన్న జ్ఞాపకార్థంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రింటర్‌ను బుధవారం అందజేశారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఎంఈఓ శివరాములు, కౌన్సిలర్ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రైనీ తహసీల్దార్‌గా డిప్యూటీ కలెక్టర్



బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కలెక్టర్

కౌతాళం: శిక్షణ తహసీల్దారుగా ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ రమణాకాంత్ రెడ్డి బుధవారం కౌతాళంకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి ఆయన స్వాగతం పలికారు. రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్‌గా ఇక్కడ ట్రైనీ తహసీల్దార్‌గా వచ్చారన్నారు. 6వారాల పాటు శిక్షణ తహసీల్దారుగా ఉంటారని తెలిపారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఇచ్చిన శిక్షణ ఉత్తర్వులు అందజేసి విధుల్లో చేరారని చెప్పారు.

విద్యుత్తు సమస్యలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

ఆదోని సెంట్రల్ : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏఈ చెన్నయ్య తెలిపారు. బుదువారం మండలంలోని దిబ్బనకల్లు గ్రామంలో రైతులకు విద్యుత్ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గాలికి విద్యుత్ తీగలు పడిపోవడం, కొన్ని చోట్ల సర్వీస్ వైర్లు లాంటివి తెగిపోతాయని అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి విద్యుత్ సమస్యలకై నా సెల్ 9440813384 నంబర్‌కు ఫోను చేయాలని చెప్పారు. సర్పంచ్ లక్ష్మన్న, యంపిటిసీ మల్లికార్జున పాల్గొన్నారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకోరాదు



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు

ఆదోని అర్బన్: బాలకార్మికులను పనిలో పెట్టుకోరాదని కార్మికశాఖ ఆదోని అసిస్టెంట్ కమిషన్ సురేష్‌బాబు అన్నారు. బుధవారం బాలకార్మికుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పట్టణంలోని కొత్త బస్టాండు ఆయా ప్రాంతాల్లోని దుకాణాల్లో, సంస్థల యజమానులకు అవగాహన కల్పించారు. సహాయ కమిషనర్ వెంకటరాముడు, ప్రతాప్‌రెడ్డి, సుందరేశ్, నేషనల్ చైల్డ్ లేబర్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.వి.రంగారెడ్డి, ఐసీపీఎస్ నుంచి నరసింహులు పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్

ఆదోని అర్బన్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల కోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రిని యార్డు చైర్మన్ మజర్ అహ్మద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని సౌకర్యాలపై డాక్టర్లతోఆరా తీశారు.ఆయన అనారోగ్యంతో వచ్చే రైతులకు చికిత్స చేయాలని ఆదేశించారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

కోసిగి: గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ భీమేష్ కోరారు. బుధవారం మండలంలో కందుకూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, గ్రామస్తులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో వ్యవసాయ అనుబంధ జీవనోపాదులు, భౌగోళిక వనరులు, నీటి వనరులు గుర్తించి పెంపొందించుకోవడంలో ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. అలాగే పరిసరాల్లో పండ్ల మొక్కలు, పెరటి తోటలు, ఆకు కూరగాయలు సాగు చేయాలన్నారు. ఇందుకు సంస్థ సహకరిస్తుందని చెప్పారు. తాయన్న, మాజీ ఎంపీటీసీ రమేష్, దేవేంద్ర, కోసిగి వెంకటేష్, పాల్గొన్నారు.

- ఖరీఫ్‌నకు ముందే రైతులకు పెట్టుబడి సాయం
- ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమైన మొత్తం
- నాలుగో ఏడాది రూ.11,42,17,500 నగదు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

సాగుకు సాయం



పొలాన్ని దుక్కిదున్నుతున్న రైతు

ఆదోని రూరల్ : ఆరుగాలం కష్టించి పంటలను సాగుచేసే రైతన్నకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏటా రూ.13,500 రైతుల ఖాతాలో జమ చేస్తుంది. ముందుగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పీఎం కిసాన్ సొమ్ముతో కలిపి రూ.7,500 జమ చేస్తారు. ఈ ఏడాది పీఎం కిసాన్ సొమ్ము లేకుండా రూ.5,500 రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఆదోని మండలంలో 15,229 మంది రైతుల ఖాతాల్లో నాలుగో విడత పెట్టుబడి సాయంగా రూ.11,42,17,500 నగదు జమ చేశారు. దీంతో పంటల సాగుకు ఈ మొత్తం ఇబ్బందులు తీరుస్తుందని రైతులు పేర్కొన్నారు.

ఎరువులు, విత్తనాలకు ఉపయుక్తం

గతంలో పంటల సాగుకు ముందు విత్తనాలు, ఎరువుల కొనగోలుకు అన్నదాతలు ఇబ్బందులు పడేవారు. నాలుగేళ్లుగా రైతు భరోసా సొమ్ము జమ చేస్తుండటంతో పొలాలను సిద్ధం చేసుకోవడానికి, లోతు దుక్కులు, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఉపయోగ పడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడికి ఎంతో ఉపయోగపడుతుంది



ప్రభుత్వం అందజేసే రైతుభరోసా, పీఎం కిసాన్ డబ్బులు పంటల పెట్టుబడికి ఉపయోగ పడుతున్నాయి. ఆ డబ్బులతో విత్తనాలు, ఎరువులను కొంటున్నాం. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే రైతులకు ఎరువులను అందిస్తుండం సంతోషంగా ఉంది. – తిమ్మన్న, నాగనాథనహళ్లి రైతు

నిజంగా రైతులకు భరోసా



ప్రతియేటా ప్రభుత్వం విడుదల చేసే రైతు భరోసా, పీఎం కిసాన్ డబ్బులు రైతులకు ఎంతో భరోసాను ఇస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికే రైతుల ఖాతాల్లో జమ చేస్తుండటం అభినందనీయం . ఆ డబ్బులతో ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసుకునేందుకు వినియోగించుకుంటున్నా. నాలుగోయేడాది కూడా నా ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. – నీలకంఠ, నారాయణపురం రైతు

రైతులకు ఎంతో ఉపయోగకరం



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా పథకం సొమ్ము రైతులకు ఎంతో ఉపయోగ పడుతుంది. విత్తనాల కొనుగోలు, ఎరువుల కొనుగోలుకు నగదు ఇబ్బందులు తప్పుతున్నాయి. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందిస్తున్నాం. – అశోక్‌కుమార్‌రెడ్డి, ఆదోని మండల వ్యవసాయాధికారి



పొలంలో గుంటుక పొస్తున్న రైతు

విత్తుకు రైతన్నలు సిద్ధం



సుకేకేరిలో సిద్ధం చేసిన పొలం

కౌతాళం: ఖరీఫ్‌లో భాగంగా పంటలు సాగు చేసేందుకు అన్నదాతలు సిద్ధమయ్యారు.ఇప్పటికే పొలాలను లోతు దుక్కులు చేసి, వాలుకు అడ్డంగా దున్ని చదును చేశారు. అలాగే గత పంట అవశేషాలను తొలగించి శుభ్రంగా ఉంచారు. ముఖ్యంగా ఈశాన్య రుతుపవనాలు వచ్చేశాయనే సమాచారంతో విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. పలు చోట్ల సేంద్రియ ఎరువులు తొలించడం, వెదజల్లే పనుల్లో బిజీగా ఉన్నారు. వర్షం వస్తే విత్తనాలు వేసేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు.



ఎరిగేరిలో గత పంట అవశేషాలను తొలగిస్తున్న కూలీలు

దిశ యాప్‌తో మహిళలకు మేలు



స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ



ఆర్టీసీ బస్టాండులో దిశ యాప్‌ను ప్రయాణికుల మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేస్తున్న మహిళా పోలీసులు

మంత్రాలయం : ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్‌తో మేలు చేకూరుతుందని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య అన్నారు. బుధవారం మండలంలోని శ్రీ మఠం, తుంగభద్ర రైల్వే స్టేషన్ పరిధిలో మహిళా పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన దిశ యాప్ డౌన్ లోడ్ స్పెషల్ డ్రైవ్‌ను సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ వాడుతున్న యువతి, మహిళలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

ఆదోని టౌన్: దిశ యాప్‌తో మహిళలకు భద్రత అని, ప్రతిఒక్కరూ మొబైల్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని మహిళా పోలీసులు, పోలీసులు ప్రజలకు సూచించారు. బుధవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. ప్రధాన రోడ్లు, కూడళ్ల, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, పట్టణ శివారులో ప్రత్యేకంగా వాహనాల తనిఖీ చేస్తూ మహిళా పోలీసులు, పోలీసులు ప్రజల మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేశారు. స్పెషల్ డ్రైవ్‌కు పట్టణ పోలీస్‌స్టేషన్‌లు, ఇస్వీ, పెద్దతుంబళం, ఆదోని తాలూకా పోలీస్‌స్టేషన్ నుంచి మూడు టీంలను ఏర్పాటు చేశామని టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు.

అర్థవంతమైన విద్యా బోధన చేపట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్యాముల్ పాల్

కోసిగి: పాఠశాల ప్రారంభం నుంచే అర్థవంతమైన, సులభ పద్ధతులో విద్యార్థులకు విలువలతో కూడిన బోధన సాగించాలని విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాముల్ పాల్ సూచించారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, వందగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులు, మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యా కానుకలను పరిశీలించారు. జగనన్న గోరు ముద్దలో భాగంగా మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమై భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. పెండింగ్ లేకుండా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. అలాగే విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని, బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని చెప్పారు.బాలికల పాఠశాల హెచ్‌ఎం శోభరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు రూ.లక్ష విరాళం



కరస్పాండెంట్ దైవాదీనంకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలకు 1979–84 బ్యాచ్‌కు చెందిన ఆర్ట్స్ గ్రూపు పూర్వపు విద్యార్థులు రూ.100116 విరాళంగా బుధవారం కరస్పాండెట్ దైవాదీనంకు అందజేశారు. పూర్వ విద్యార్థులు నరసయ్య, ఎలికె చిన్నప్ప, క్రిష్ణమ నాయుడు, రామలింగారెడ్డి, మురళీధర్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, రామేశ్వరరెడ్డి, పంపాపతి, భీరప్ప మాట్లాడుతూ ఇంటర్ నుంచి బీఏ వరకు 1979–84 వరకు కళాశాలలో చదివామని, తమ ఉన్నతి కారణమైన కళాశాలకు సాయం చేయాలని విరాళం అందజేశామని చెప్పారు. ఈ విరాళాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో బీఏ హెచ్‌ఈపీ ఫైనల్ ఇయర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థికి ఏటా అవార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే.. ఈ ఏడాది ప్రతిభ చూపిన విద్యార్థులకు అందజేయాలని రూ.6,300 అందజేశారు. కళాశాల యాజమాన్యం సభ్యులు విట్టా సురేంద్రబాబు, ప్రిన్సిపాల్ మురళీ మోహన్, సురేష్, రిటైర్డ్ అధ్యాపకుడు రామచంద్ర పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆదోని అర్బన్ : ప్రాణాపాయ స్థితిలోనున్న వారికి రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టేనని వక్తలు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆర్డిప్ సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ జొనాథన్, ఆర్డిప్ సిబ్బంది రంగన్న, ఎర్రిస్వామి, కవిత, లక్ష్మి పాల్గొన్నారు. అలాగే.. బ్లడ్‌బ్యాంకు ఏరియా ఆస్పత్రి వారు బుధవారం రక్తదాతలను ఘనంగా సన్మానించారు. సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ మాట్లాడారు. మీనాక్షి, అస్లాం, భాస్కర్, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశులు, అశోక్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బడి బస్సులపై చర్యలు తీసుకోవాలి



ఆర్టీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : డివిజన్‌లోనున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్‌ఐ నాయకులు కోరారు. బుధవారం ఈ మేరకు ఆర్‌టీఓ నాగేంద్రకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలలు ప్రారంభమైనా కూడా ఫిట్‌నెస్ లేని బస్సులు తిరుగుతున్నాయని, అటువంటి బస్సులను గుర్తించి సీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉరుకుందలో 19న వేలాలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. బుధవారంవారు మాట్లాడుతూ కొబ్బరి కాయలు సరఫరా చేయుటకు, అర కొబ్బరి చిప్పల్ని పోగు చేసుకొనే హక్కు కోసం వేలం నిర్వహిస్తామన్నారు.ఈ ఏడాది జూలై27 నుంచి ఒక సంవత్సరం వరకు హక్కు ఉంటుందన్నారు. అదే రోజు షీల్డ్ టెండరును కార్యాలయంలో ఉంచిన బాక్స్‌ల్లో వేయాలని, అలాగే ఈ–టెండరు ద్వారా వేలంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల17వ తేదీ మధ్యాహ్నంలోపు ఆన్‌లైన్ ద్వారా టెండరును దాఖలు చేయాలని చెప్పారు. అలాగే క్షేత్ర పరిసరాల్లో వివిధ ప్రాంతాల్లోనున్న మరుగుదొడ్ల నిర్వహణకు, భక్తుల పాదరక్షల భద్రతకు ఒక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ కమ్ షీల్డ్ టెండర్‌తో పాటు బహిరంగ వేలం అదే రోజు ఉంటుందని వివరించారు.

వలంటీర్లకు నోటీసులు

ఆదోని టౌన్ : స్థానిక వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వలంటీర్లు పనితీరు అధ్వానంగా ఉందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 35వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు సమయానికి విధులకు హాజరుగాకపోవడంపై సంజాయిషీ ఇవ్వాలని మెమోలు జారీ చేస్తామన్నారు. విధులకు డుమ్మా కొడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు వలంటీర్లను తొలగించాలని సచివాలయం, సంబంధిత సెక్షన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి, మున్సిపాలిటీకి చెడ్డపేరు తీసుకొస్తున్నారనే కారణంగా తొలగిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వివిధ రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ పాఠశాలలో నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

వేడుకగా ప్రతిష్ఠోత్సవాలు

మంత్రాలయం: మండలంలోని సోళ్లహళ్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వనాథ, న్నపూర్ణదేవి, ణపతి, జస్తంభ గోపురం,కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువా కప్పి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు లక్ష్మిరెడ్డి, ఎస్ఐ కిరణ్, సర్పంచ్ రాధ ఉన్నారు.

నేటి నుంచి మట్టి నమునాల సేకరణ

కౌతాళం: మండలంలోని గ్రామాల్లో గురువారం నుంచి మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం నిర్వహస్తామని మండల వ్యవసాయ అధికారి శేషాద్రి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి 22 మట్టి నమునాలను సేకరిస్తామన్నారు. ఆసక్తి కల్గిన రైతులు తమ పొలాల్లోని మట్టిని తీసుకొచ్చి రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి ఇవ్వాలని కోరారు. ఫలితాలు వచ్చిన తరువాత ఏఏ పంటలు వేయాలి, ఎలాంటి ఎరువులు, మందులు వాడాలో సూచిస్తామని చెప్పారు.

గుడిసె దగ్ధం

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో హరిజన అంజినప్పకు చెందిన గుడిసె కాలిపోయింది. బుధవారం ఉదయం గుడిసెకు తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. గుడిసె నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. అంతలోనే మంటలు చెలరేగి పూర్తి కాలిపోయింది. దీంతో గుడిసెలో ఉన్న రూ.20వేల నగదు, తిండి గింజలు, బట్టలు, వంటసామగ్రి కాలి బూడిదయ్యాయి.

18న క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (రూరల్): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న కర్నూలు నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో అండర్–16 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దేవేంద్ర గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. 2009 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9959251047 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అనధికార సర్దుబాటుపై స్పందించాలి



నిరసన తెలుపుతున్న పురపాలక ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్ : పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలల్లో అనధికార సర్దుబాటులపై స్పందించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్యా నాయకులు జి. బసవరాజు, కోటన్న కోరారు. బుధువారం పురపాలక ఉన్నత పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటుపై వేరే పాఠశాలకు పంపడం సరికాదన్నారు. ఇందుకు సంబంధించిన వివరణను ప్రదానోపాధ్యాయులను కోరగా పై అధికారుల సూచనల మేరకు పంపినట్లు చెబుతున్నారన్నారు. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా సర్దుబాటు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సంఘం పట్టణ కార్యదర్శి సురేష్ కుమార్, పట్టణశాఖ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు దస్తగిరి,చంద్రమౌళి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

కౌతాళం: బాల్య వివాహాలను అరికట్టడానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మినారాయణ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధించడంతో పాటు దానిపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలన్నారు. సచివాలయంలో సేవల్ని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని ఆదేశించారు. తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ గోపినాథ్‌వర్మ ఏఈ అనుసుమ, ఏపీఓ జుబేర్ అహ్మద్, ఏపీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

జంట హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కౌతాళం: మండలంలోని బాపురం గ్రామంలో ఈనెల 9వ తేదీన జరిగిన తల్లి, కుమార్తెల హత్య కేసులో నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోసిగి సీఐ ఎరిషావలి మాట్లాడుతూ సంసారం విషయంలో భార్య, భర్తల మధ్య జరిగిన గొడవలో భార్య మహాదేవి, అత్త తలారి హనుమంతమ్మను హత్య చేసిన రమేష్‌ను బాపురం శివారులోని చాపమ్మవ్వ దేవాలయం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతడి నుంచి సెల్‌ఫోన్‌తో పాటు హత్యకు ఉపయోగించిన కర్ర, రక్తపు మరకలు ఉన్న బట్టలను స్వాధీనం చేసుకుని ఆదోని కోర్టుకు తరలించనట్లు పేర్కొన్నారు. తక్కువ కాలంలోనే నిందితుడిని పట్టుకున్న సీఐ ఎరిషావలి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, హెచ్‌సీ మహేష్, కానిస్టేబుళ్ల మధు, రామచంద్ర, వీరేష్, నాగరాజు, వీరభాస్కర్‌లను ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారని సీఐ వివరించారు.

విషపురుగు కాటుతో బాలిక మృతి



మృతిచెందిన బాలిక హైమావతి

ఆదోని అర్బన్ : విష పురుగు కాటు వేయడంతో బసాపురం గ్రామానికి చెందిన వీరయ్య కుమార్తె హైమావతి(15) మృతి చెందింది. ఇస్వీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం బాలికను విషపురుగు కాటు వేయగా మధ్యాహ్నం గొంతు వద్ద వాపు వచ్చింది. దీంతో వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక బాలిక మృతిచెందింది. వీరయ్యకు ఐదుగురు ఆడపిల్లలు కాగా, హైమావతి నాలుగో సంతానం. పదో తరగతి ఫెయిల్ అయ్యి ఆదోనిలో కుట్టుమిషన్ నేర్చుకోవడానికి వెళ్తుండేది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు.

ప్రేమను నిజం చేసుకోవాలని..

- మైనర్ బాలికతో ప్రేమ.. పెళ్లి
- అంగీకరించని తల్లిదండ్రులు
- బెదిరించి ఒప్పించాలని ప్రేమికులిద్దరూ ఆత్మహత్యా యత్నం
- యువకుడు మృతి, ప్రాణాలతో బయటపడిన బాలిక



శివప్రసాద్ (ఫైల్)

ఆదోని అర్బన్ : మైనర్ బాలికను ప్రేమించి పెళ్లి చేసుకోగా.. ఇరువైపుల తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఎలాగైనా తమ ప్రేమను బతికించుకోవాలని ఇందుకు పెద్దలను బెదిరించాలని ప్రేమికులిద్దరూ విష గుళికలు మింగి తమ తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. దీంతో వారు ఆసుపత్రికి తరలించగా బాలిక ప్రాణాలతో బయటపడగా.. యువకుడు మృత్యు ఒడి చేరాడు. వివరాలు.. చిప్పగిరి మండలం నగరడోణ గ్రామానికి చెందిన శివప్రసాద్ (23) గుత్తి మండలం వజ్రకరూరు గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఓ వివాహంలో పరిచయం చేసుకున్నాడు. అది ప్రేమగా మారడంతో నెలన్నర క్రితం పెళ్లి చేసుకున్నారు. అయితే వీరి పెళ్లిని పెద్దలు అంగీకరించలేదు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో శివప్రసాద్‌పై గుంతకల్‌లో కిడ్నాప్ కేసు నమోదైంది. పెద్దల పంచాయితీలో కేసు వాపసు తీసుకుంటామని యువకుడి తల్లిదండ్రుల నుంచి బాలిక కుటుంబ సభ్యులు కొంత మొత్తం తీసుకున్నారు. తమ పెళ్లిని అంగీకరించేలా చేయాలని, తమ పెద్దలను బెదిరించేందుకు ప్రేమికులు ఇద్దరూ..బుధవారం పత్తికొండలో శివప్రసాద్ బంధువుల ఇంట్లో విష గుళికలను మింగారు. అనంతరం తాము ఆత్మహత్య చేసుకోవాలని విష గుళికలు మింగామని ఇద్దరూ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే వారి బంధువులు పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఇద్దరికీ ప్రాథమిక చికిత్స చేయగా బాలిక కోలుకుంది. అయితే శివప్రసాద్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. కాగా..శివప్రసాద్ గుంతకల్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ భూముల వేలం

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామ పంచాయతీకి సంబంధించిన వ్యవసాయ భూముల కౌలు హక్కుల వేలం రూ.4.14 లక్షలు పలికింది. బుధవారం జొహరాపురంలో సర్పంచ్ నెల్లూరప్ప ఆధ్వర్యంలో పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు సమక్షంలో 2023–24కు సంబంధించి పంచాయతీకి చెందిన 52 ఎకరాల భూమి కౌలు హక్కులకు వేలం నిర్వహించారు. గ్రామ రైతులు వేలం పాల్గొన్నారు. సర్వే నంబర్లు 578, 645, 646, 648లో 52 ఎకరాలను షేక్షావలి, గురుస్వామి, ఈరన్న అనే రైతులు రూ.4.14 లక్షలకు దక్కించుకున్నారు.